క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో ఆటంకం కలుగునుందని నిజాంపేట్ ఏఈ రాకేష్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ బృందావన్ హిల్స్ ఫీడర్ పరిధిలోని బృందావన్ హిల్స్, ప్రశాంతిహిల్స్, సైదప్పకాలనీ, బండారు లేఅవుట్, రాజధాని స్కూల్ ఏరియాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కుత్బుల్లాపూర్, గణేశ్‌నగర్ ఫీడర్ పరిధిలోని...

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ ఫీడర్ పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామం, బీరప్పనగర్, మంజీర అపార్ట్‌మెంట్స్, కృష్ణకుంజ్ హోమ్స్, వీరస్వామినగర్, వెంకటేశ్వరనగర్లోని ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు..

◆ అదే విధంగా గణేశ్‌నగర్ ఫీడర్ పరిధిలోని గణేష్‌నగర్, షాథీయేటర్ వెనుక గల్లీ, జనహిత ఆస్పత్రి ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని కుత్బుల్లాపూర్ ఏఈ తెలిపారు.

నా దేశం.. నా మట్టి



మట్టి దీపాలతో ప్రతిజ్ఞ చేస్తున్న బీజేపీ నాయకులు

సుబాష్‌నగర్: మెట్టుకానిగూడలో బీజేపీ శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు శ్రీనివాస్‌రెడ్డి, ఈగ ఆంజనేయులు ఆధ్వర్యంలో మేరీ మాటి మేరా దేశ్ (నా దేశం.. నా మట్టి) కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మట్టి దీపాలతో ప్రతిజ్ఞ చేశారు. అనంతరం డివిజన్ అధ్యక్షుడు సాయినాథ్ ఆధ్వర్యంలో 75 మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువ మోర్చా కార్యదర్శి రేవతిరెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రావు, రాజారెడ్డి, సోషల్ మీడియా కోకన్వీనర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భ్రమరాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు

జగద్గిరిగుట్ట: అధిక శ్రావణ మాసం సందర్భంగా డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్ శ్రీభ్రమరాంబిక, మల్లికార్జునస్వామి ఆలయంలో శుక్రవారం 33 రకాల పదార్థాలతో వాయనాలు సమర్పించారు. ఆ తర్వాత జరిగిన కంకుమార్చన కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న ఎమ్మెల్సీ



భద్రాద్రి సీతారాముడిని దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజు

కుత్బుల్లాపూర్: ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు శుక్రవారం భద్రాద్రి రాముల వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనను శాలువతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్సీతో పాటు కార్పొరేటర్ రావుల శేషగిరి, నాయకులు జిన్నారం వెంకటేష్‌గౌడ్, రాజేష్, రచ్చ చక్రధర్ తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న మన్నె రాజు

సుభాష్‌నగర్: ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఫిషరీస్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ మన్నే రాజు అన్నారు. శుక్రవారం నారాయణ హృదయాలయ మల్లారెడ్డి హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం సుభాష్ నగర్ డివిజన్ పరిధి సూరారంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.

నివాళి

సుభాష్‌నగర్: గాజులరామారంలోని సీఎంఆర్ మోడల్ హైస్కూల్‌లో శుక్రవారం చామకూర మల్లారెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఫౌండర్ చామకూర గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. తన తండ్రి ఆశయాల సాధనకు విద్యా సంస్థలను స్థాపించి అన్ని వర్గాల విద్యార్థులకు విద్యనందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హరిశంకర్, ఏఓ సత్తిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పద్ధతి మార్చుకోవాల్సిందే..

- లేకుంటే ల్యాండ్‌గ్రాబింగ్ కేసులు పెడతాం
- ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే చర్యలు
- గండిమైసమ్మ-దుండిగల్ తహసీల్దార్ సుచరిత



దుండిగల్: సహాయం కోసం కార్యాలయానికి వచ్చే ప్రతి రైతు, పౌరుడు, ఫిర్యాదుదారులకు తప్పకుండా పూర్తి న్యాయం చేస్తానని... ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే ఉపేక్షించేది లేదని గండిమైసమ్మ-దుండిగల్ మండల తహసీల్దార్ సుచరిత అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆమె 'సాక్షి'తో ప్రత్యేక ఇంటర్వ్యూ.

ప్రశ్న: మండలంలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ స్థలాలను ఎలా పరిరక్షిస్తారు?

జవాబు: ఇప్పటి వరకు ఇక్కడ ఏం జరిగిందో నాకు తెలియదు. ఈ రోజు నుంచి ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే వెంటనే కూలి్చవేస్తాం. పద్ధతి మార్చుకోకపోతే ల్యాండ్ గ్రాబింగ్ కేసులు పెడతాం. వచ్చిన తొలి రోజునే అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు రావడంతో కూల్చి వేయమని సిబ్బందికి చెప్పా.

ప్రశ్న: ఇటీవల కురిసిన వర్షాలకు మల్లంపేటలోని బిహార్ బస్తీ, కొంపల్లి ఉమామహేశ్వర కాలనీలు నీట మునిగాయి. అక్కడ అక్రమ నిర్మాణాలనే కారణమంటున్నారు?

జవాబు: త్వరలో ఆ ప్రాంతాల్లో పర్యటించి పూర్తి వివరాలు తెలుసుకుంటాను. ఆక్రమణలు ఉంటే తొలగిస్తాం.

ప్రశ్న: జీఓ.59 కింద దరఖాస్తు చేసుకున్న వారికి ఎక్కడ డబ్బులు చెల్లించాలని డిమాండ్ నోటీసులు ఇచ్చిన వాటిపై మీ సమాధానం?

జవాబు: మేము చేసేదేమీ ఉండదు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఆయా ప్రాంతాల్లో మార్కెట్ ధర నిర్ణయిస్తారు. దాని ప్రకారమే డిమాండ్ నోటీసులు ఇస్తారు. రెగ్యులరైజ్ చేసుకునే విధంగా వారికి అవగాహన కల్పిస్తాం. ఇప్పటి వరకు 1400 దరఖాస్తులు రాగా వాటిని పూర్తి చేశాం. పెండింగ్‌లో ఉన్న 543 దరఖాస్తులను కూడా త్వరలోనే పరిష్కరిస్తాం.

ప్రశ్న: రెవెన్యూ, ఇరిగేషన్ మధ్య ఉన్న సమన్వయ లోపం కారణంగా జరుగుతున్న చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల కబ్జాలపై ఏం చర్యలు తీసుకుంటారు?

జవాబు: ముందుగా ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువుల బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌లను గుర్తించి ఫెన్సింగ్ గాని, హద్దు రాళ్లు గాని ఏర్పాటు చేయాలి. అలా చేస్తే మేము వంద శాతం ప్రభుత్వ భూములను కాపాడుతాం. అక్కడ చేపట్టే నిర్మాణాలను తక్షణమే కూలి్చవేస్తాం. వారితోనూ సమన్వయం చేసుకుంటూ పని చేస్తాం.

ప్రశ్న: కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల జారీలో ఆలస్యానికి కారణం?

జవాబు: గతంలో ఏం జరిగిందో తెలియదు. ఇప్పటి నుంచి ఎప్పటికప్పుడు దరఖాస్తు చేసుకున్న వెంటనే పత్రాలను జారీ చేస్తాం. అధిక సంఖ్యలో దరఖాస్తులు వస్తే రాత్రిళ్లు వరకు సిబ్బందితో పని చేయిస్తాం. తమ వద్దకు వచ్చే ప్రతి అర్జీదారుడికి న్యాయం చేస్తాం.

ప్రశ్న: ఎన్నికల అధికారిగా ఉన్న మీరు పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి చర్యలు చేపట్టారు?

జవాబు: గండిమైసమ్మ-దుండిగల్ మండల పరిధిలోని కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీల్లో ఇప్పటి వరకు 82,172 ఓటర్లు నమోదయ్యారు. ఈ సంఖ్య ఇంకా పెరుగుతుంది. ఒక్కో పోలింగ్ స్టేషన్‌లో 1200 నుంచి 1300 ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. అన్ని కేంద్రాలను సందర్శించాం. ఎన్నికల నాటికి ఆయా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం.

మున్సిపాలిటీలో అనాథల వివరాలను సేకరించాలి

- ఇంటింటి సర్వే పరిశీలనలో కమిషనర్ సత్యనారాయణరావు



వివరాలను నమోదు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

దుండిగల్: మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అనాథల వివరాలను సేకరించాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావు అన్నారు. మున్సిపాలిటీలో జరుగుతున్న ఇంటింటి సర్వేపై శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 15వ తేదీ వరకు 23 సంవత్సరాలలోపు అనాథలను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలన్నారు. ఆయా ప్రాంతాల్లో సంరక్షకుల వద్ద ఉన్న వారిని గుర్తించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, పొదుపు సంఘాల మహిళలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్ల సహకారం తీసుకోవాలన్నారు. సమగ్ర వివరాలను ఉన్నతాధికారులకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ నర్సింహులు, బిల్ కలెక్టర్ సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు



బాలయ్యనగర్‌లో ప్రభుత్వ పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రజావసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తు ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శుక్రవారం గాజులరామారం డివిజన్ పరిధిలోని బాలయ్యనగర్‌లో రూ.48 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అదే విధంగా రూ.40 లక్షలతో శోధన లాబొరేటరీస్ కంపెనీ అందజేసిన సీఎస్ఆర్ నిధులతో పూర్తి చేసిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ప్రహరీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శోధన లాబొరేటరీస్ సీఈఓ డాక్టర్ తోట గిరిధర్, ఎండీ రాహుల్, జనరల్ మేనేజర్ సురేష్, అసిస్టెంట్ ఎంఈఓ రమేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజు, కమలాకర్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు ఉన్నారు.

◆ ప్రగతియాత్రలో భాగంగా గాజులరామారం డివిజన్ పరిధిలోని నర్సింహబస్తీ, హుస్సేన్ బస్తీ, పోచమ్మ బస్తీ, కట్టమైసమ్మ బస్తీ, అబిద్ బస్తీలను సందర్శించిన ఎమ్మెల్యే స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఫిర్యాదు చేసినా చర్యలు లేవు

జగద్గిరిగుట్ట: వార్డు కార్యాలయ సమీపంలో జరుగుతున్న కబ్జాలు, చుట్టు పక్కల పడేస్తున్న చికెన్ వ్యర్థాలతో పడుతున్న ఇబ్బందులపై జగద్గిరిగుట్ట బీఆర్ఎస్ యువజన విభాగ అధ్యక్షుడు రాయి విగ్నేష్ వార్డు కార్యాలయంలో ఫిర్యాదు చేసారు. ఈనెల 4వ తేదీ కూడా ఇదే విషయమై ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆయన అన్నారు. అధికారులు విషయమై స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వం కనీస పెన్షన్‌ను రూ.9వేలకు పెంచాలి



స్టిక్కర్‌ను విడుదల చేసిన టాప్రా సభ్యులు

నిజాంపేట్: దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 85 లక్షల మంది ఈపీఎస్-95 పెన్షన్‌దారులకు ఊరట కలిగేలా కేంద్ర ప్రభుత్వం కనీస పెన్షన్‌ను రూ.9వేలకు పెంచాలని... తదనుగుణమైన కరువు భత్యం ప్రకటించాలని 'తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్'(టాప్రా) మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు డిమాండ్ చేశారు. శుక్రవారం కూకట్‌పల్లి హెచ్‌ఎంటీ థర్డ్ వెంచర్ శాతవాహననగర్ కమ్యూనిటీహాల్‌లో 'టాప్రా' కూకట్‌పల్లి ఏరియా కమిటీ అధ్యక్షుడు దుర్గప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి మల్కాజ్‌గిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బాలగంగాధరరావు, చెన్నకేశవులు పాల్గొన్నారు.

◆ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 39 లక్షల మంది ఈపీఎస్ పెన్షన్ దారులు నెలకు రూ.700 పెన్షన్ పొందుతూ దుర్భరమైన జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'జాగో ఈపీఎస్-95 పెన్షనర్స్', 'నో హయర్ పెన్షన్ - నో వోట్'అనే స్టిక్కర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఏరియా కమిటీ అధ్యక్షుడు అశోక్, శాతవాహననగర్ సంక్షేమ సంఘ కార్యదర్శి యాదిరెడ్డి, 'టాప్రా' నాయకులు వెంకటరామరెడ్డి, రామ్‌లక్ష్మణ్‌రెడ్డి, మోహనరావ్, వెంకటరాజం, శ్రీమతి చంద్రకళ, విజయకుమార్, బాలశెట్టి, ఆంజనేయులు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కాపాడాలి

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఫాక్స్‌సాగర్ నాలా ప్రాంతంలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములను పరిరక్షించాలని మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు భైరి ప్రశాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం దుండిగల్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే కబ్జాలు జరుగుతున్నాయని అన్నారు. అధికారులు పట్టించుకోకపోతే ప్రభుత్వ భూముల పరిరక్షణకు ఉద్యమిస్తామన్నారు. మాజీ కో-ఆప్షన్ సభ్యులు షేక్ ఇబ్రహీం, మాజీ వార్డు సభ్యులు కావలి గోపాల్, నవీన్ ముదిరాజ్, సన్న వేణుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయానికి ఫిర్యాదు చేయడానికి వచ్చిన కాంగ్రెస్ నాయకులు

యుద్ధప్రాతిపదికన సమస్యల పరిష్కారం



రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న కౌన్సిలర్లు

దుండిగల్: స్థానికంగా నెలకొన్న సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరిస్తున్నామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ డి.పోచంపల్లిలోని 8వ వార్డులో రూ.15 లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీరోడ్డు పనులకు శుక్రవారం ఆయన వైస్‌చైర్మన్ పద్మారావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. త్వరలోనే మిగిలిన పనులను పూర్తి చేస్తామన్నారు. అనంతరం స్థానికంగా నిర్మిస్తున్న అమ్మవారి ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. శమ్మీన్ మసీదును సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సాయిబాబా యాదవ్, బండారి మహేందర్ యాదవ్, గోపాల్‌రెడ్డి, నేతలు శ్రీనివాస్ యాదవ్, నల్తూరి కృష్ణ, వెంకటేశ్, హాజీ, సర్వర్, తిరుమలేశ్, ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

గల్లీ మొత్తం తవ్వి వదిలేశారు!

కుత్బుల్లాపూర్: డ్రైనేజీ పైపులు రాలేదంటూ... ఆ కాలనీలో గల్లీ మొత్తం తవ్వి వదిలేశారు. సుమారు 20 ఇళ్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అటు అధికారులు గానీ.. ఇటు కాంట్రాక్టర్ గాని స్పందించకపోవడంతో ఎటు పాలు పోనీ పరిస్థితిలో గల్లీ ప్రజలు ఉన్నారు... ఇదే విషయంపై ఫోన్‌లో వివరాల కోసం ఆరా తీస్తే పూర్తి చేస్తామంటూ 20 రోజులుగా కాలయాపన చేస్తూ వచ్చారు. ఇది కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ పరిస్థితి. ఇప్పటికైనా డ్రైనేజీ, రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు.



శ్రీనివాస్‌నగర్‌లోని ఓ గల్లీ రోడ్డు తవ్వేసిన దృశ్యం

చోరీ చేసిన ఆటోతో దొరికిపోయిన దొంగ

జగద్గిరిగుట్ట: శ్రీనివాస్‌నగర్‌కు చెందిన గుజ్జల సురేష్ వృత్తిరీత్యా ఆటో డ్రైవర్. ఈనెల 7వ తేదీన గాజులరామారం, ఉషోదయకాలనీ పార్క్‌లో ఆటోను పార్క్ చేసి బుకింగ్ కోసం వేచి చూస్తున్నాడు. అప్పుడే ఓ వ్యక్తి సురేష్ దగ్గరకు వచ్చి ఇక్కడ పార్కింగ్ ఎందుకు చేశావని గొడవకు దిగాడు. అంతే కాకుండా రాడ్‌తో ఆటోను కొడుతూ సురేష్ ముఖంపై గాయం చేశాడు. దీంతో భయంతో సురేష్ ఆటో నుంచి బయటకు దిగాడు. ఇదే అదునుగా భావించిన ఆ వ్యక్తి ఆటోను తీసుకొని పారిపోయాడు. దీనిపై పోలీసులు విచారణ చేపడుతుండగా శుక్రవారం మహదేవ్‌పురం వద్ద మహమ్మద్ చాంద్ పాషా అనే వ్యక్తి అనుమానాస్పదంగా ఆటోను నడుపుతూ కనిపించాడు. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు విచారించగా ఆటో దొంగిలించింది తానేనని చాంద్ పాషా ఒప్పుకోవడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని జగద్గిరిగుట్ట సీఐ క్రాంతికుమార్ తెలిపారు.

క్రైం కార్నర్..

విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి

కుత్బుల్లాపూర్: విద్యుద్ఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుచిత్ర సమీపంలోని రామరాజునగర్‌లో నివాసముండే తిమ్మన్నగారి నరేష్(39), స్వప్నలు భార్యాభర్తలు. శుక్రవారం ఉదయం 9గంటల ప్రాంతంలో స్వప్న తన పిల్లలను స్కూల్‌కు పంపి ఇంటికి రాగా రెయిలింగ్‌పై భర్త నరేష్ బోర్లా పడి ఉన్నాడు. అతడిని పట్టుకునేందుకు ప్రయత్నించిన స్వప్నకు విద్యుత్ షాక్ తగలడంతో కొద్ది దూరంలో పడింది.దీంతో చుట్టు పక్కల వారి సహాయంతో భర్తను రెయిలింగ్ నుంచి కిందకు లాగగా అప్పటికే మృతి చెందాడు. పక్క పోర్షన్‌లో ఉంటున్న వారు ఏసీకి సంబంధించి వైర్‌ను తమ ఇంటి రెయిలింగ్‌కు కట్టారని అన్నారు. రెయిలింగ్‌ను పట్టుకున్న తన భర్త షాక్‌కు గురై మృతి చెందాడని మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం



రాజేశ్వరి (ఫైల్)

సుభాష్‌నగర్: భర్త వేధింపులు తాళలేక పుట్టింట్లో ఉంటున్న మహిళను తిరిగి భర్త వద్దకు పంపే ప్రయత్నాలు చేయడంతో అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం కాలనీకి చెందిన శివరెడ్డి కుమార్తె రాజేశ్వరి(21) భర్త వేధింపులు తాళలేక పుట్టింటికి వచ్చి ఉంటూ స్థానికంగా కొబ్బరి నీళ్ల వ్యాపారం చేస్తోంది. అయితే తల్లిదండ్రులు ఆమెకు నచ్చజెప్పి తిరిగి భర్త వద్దకు పంపేందుకు యత్నించారు. ఇది ఇష్టం లేని రాజేశ్వరి శుక్రవారం మధ్యాహ్నం దుకాణం నుంచి ఇంటికి వచ్చి ఆపై కనిపించకుండా పోయింది. ఆందోళన చెందిన తల్లిదండ్రులు చుట్టు పక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాటర్‌వర్క్స్ ఉద్యోగి ఆత్మహత్య

- సూసైడ్ నోట్‌లో అధికారుల పేర్లు
- ఆందోళనకు దిగిన యూనియన్ నాయకులు, మృతుడి బంధువులు

చింతల్: కుత్బుల్లాపూర్ వాటర్‌వర్క్స్ కార్యాలయంలో పనిచేస్తున్న క్యాషియర్ గిరిబాబు గురువారం ఉదయం ఇంట్లో ఆత్మహత్య చేసుకోవడంతో వాటర్‌వర్క్స్ కార్యాలయంలో పెద్ద కలకలం రేగింది. అక్కడే లభించిన సూసైడ్ నోట్‌లో ఇద్దరు ముగ్గురు అధికారుల పేర్లు ఉండటంతో జలమండలి యూనియన్ నాయకులు, బంధువులు శుక్రవారం కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు.

◆ వాటర్ వర్క్స్ అధికారుల ఒత్తిడి వల్లే గిరిబాబు ఆత్మహత్య చేసుకున్నాడని యూనియన్ నాయకులు అన్నారు. అతడి కుటుంబానికి న్యాయం జరిగే వరకూ ఆందోళన విరమించేది లేదంటూ భీష్మించు కూర్చున్నారు. అనంతరం జీఎం శ్రీధర్‌రెడ్డి అక్కడికి రాగా కొంతసేపు నినాదాలు చేశారు. జీఎం శ్రీధర్ రెడ్డి కల్పించుకొని గిరిబాబు కుటుంబానికి న్యాయం జరిగేలా చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో యూనియన్ నాయకులు, కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు. కాగా గిరిబాబు కుటుంబానికి రూ.5లక్షలు నష్టపరిహారం ఒప్పందం జరిగినట్లు సమాచారం.



జలమండలి కార్యాలయం వద్ద ఆందోళనకు దిగిన యూనియన్ నాయకులు, మృతుడి బంధువులు



జీఎం శ్రీధర్‌రెడ్డితో మంతనాలు జరుపుతున్న యూనియన్ నాయకులు

అడ్డూఅదుపు లేకుండా అక్రమ నిర్మాణాలు



వినాయకనగర్‌లో జీ-ప్లస్-3 పెంట్‌హౌస్ నిర్మాణం

- టౌన్‌ప్లానింగ్ అధికారుల ప్రోత్సాహంతో యథేచ్ఛగా నిర్మాణాలు
- ఫ్లోర్‌కో రేటు తీసుకుని ప్రోత్సహిస్తున్న వైనం
- అక్రమ నిర్మాణమని ఫిర్యాదు చేస్తే దాటవేస్తున్న అధికారులు

కుత్బుల్లాపూర్: సర్కిల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. అనుమతులు తీసుకొని అదనపు అంతస్తులు నిర్మిస్తున్న వారు కొందరైతే.. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించేవారు మరికొందరు. ఇలా వీరిని ప్రోత్సహిస్తూ టౌన్‌ప్లానింగ్‌లో ఉన్న ఓ సెక్షన్ అధికారి లక్షల్లో వసూలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. సదరు నిర్మాణంపై ఫిర్యాదు చేస్తే మరో లక్ష అదనంగా వసూలు చేస్తున్నారన్న పుకార్లు షికార్లు చేస్తున్నాయి.

– ఇప్పటికే కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని అనేక ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో జోనల్ టాస్క్ ఫోర్స్ టీమ్‌ను నియమించి కూల్చివేతలకు శ్రీకారం చుట్టారు. వీరికి సహకరించాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు లక్షల్లో డబ్బులు తీసుకుంటూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే అది తమ పరిధి కాదని చేతులెత్తేస్తున్నారు. కానీ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తుంది మాత్రం టౌన్ ప్లానింగ్ అధికారులే అని నిర్మాణదారులు బహిరంగంగా పేర్కొనడం విశేషం.

– జీహెచ్‌ఎంసీ ఆదాయానికి గండి పడేలా నిర్మాణాలు కొనసాగుతున్న చోద్యం చూడడం వెనక ఈ లావాదేవీల తతంగమేనని గుసగుసలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఓ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారి మాత్రం అక్రమ నిర్మాణాలపై లక్షల్లో డబ్బులు వసూలు చేస్తూ ఏమీ ఎరగనట్టు ఉంటున్నారు. ఈ అధికారి వసూళ్ల భాగోతం వింటే ఎవరైనా కంగు తినాల్సిందే.

– మొదట అక్రమ నిర్మాణం చేసుకుంటామని ఒప్పందం సమయంలో రెండు లక్షలు.. ఎవరైనా సదరు నిర్మాణంపై ఫిర్యాదు చేస్తే మరో లక్ష అదనం .. సెల్లార్ నిర్మాణం చేపట్టిన, షట్టర్లు వేసిన ఒక్కో షటర్‌కు లక్ష చొప్పున ఈ అధికారికి డబ్బులు చెల్లించాల్సిందే.. లేదంటే మొదట ఇచ్చిన డబ్బులు లెక్కలో లేనట్టే.. ఇలా లక్షల్లో డబ్బులు వసూలు చేస్తూ గత రెండు మూడు సంవత్సరాలుగా ఇక్కడే తిష్ట వేస్తూ వసూళ్ల పర్వానికి తెరలేపుతున్నారు.

– ఇటీవల ఓ నిర్మాణ దారుణం వద్ద సుమారు రెండు లక్షలు వసూలు చేసి కిందిస్థాయి సిబ్బందితో మొదటి నోటీసు జారీ చేశారు. ఈ సమయంలో డబ్బులు ఇచ్చిన విషయం వెలుగులోకి రావడంతో సదరు సిబ్బంది కంగుతిన్నారు. డబ్బులు ఇచ్చిన విషయం చెప్పినందుకు రెండో నోటీసు ఇవ్వాలని సిబ్బందిని పురమాయించడం విశేషం. ఇలా అనేక ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాల వెనుక సదరు అధికారి వసూలు చేస్తున్న లంచాల విషయంపై విజిలెన్స్, ఏసీబీ అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తాం..



కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఉప కమిషనర్ నాగమణి ని సాక్షి వివరణ కోరగా తాను కొత్తగా వచ్చానని, ఎన్నికల షెడ్యూల్లో బిజీగా ఉండడం మూలంగా అక్రమ నిర్మాణాలపై దష్టి సారించలేదని, ఫిర్యాదులు వస్తే తప్పకుండా కూల్చి వేస్తాం. ఉపేక్షించేది లేదన్నారు.

– నాగమణి. ఉప కమిషనర్, కుత్బుల్లాపూర్